# ట్రాన్స్‌ఫర్

ఉత్తరం పోష్టుచేసి హుషారుగా రూముకి బయలుదేరాడు వేణు. అతనికి చాలా ఉత్సాహంగా వుంది. ఇంక నాలుగైదు రోజుల్లో తను సరస్వతిని చూస్తాననే వూహ అతని మనస్సుని గాల్లో తేలుస్తోంది.

తమ పెళ్ళయి రెండేళ్ళయింది. అందులో ఒక సంవత్సరం నుండి ఎడబాటు. తను సరస్వతిని చూసి ఎన్నిరోజులయింది! రోజులేమిటి! నెల్లయ్యింది. మూడ్నెల్లు కాబోలు. పండక్కి చూశాడు.

అసలు తనమాట సరస్వతి ఎప్పుడైనా వింటేనా? మొదట్లో ఉద్యోగం చేయవద్దంటే ఎంత కోపం వచ్చింది! తనేమి అనలేదేమిటి!! ఆ ముఖం చూస్తే చాలు ఎంత కోపం వచ్చినా ఐసులా కరిగిపోతుంది. మొత్తానికి తన పంతం నెరవేర్చుకుంది. ఉద్యోగంలో చేరింది.

పోనీ తనకు ట్రాన్స్ఫర్ అయినప్పుడు "ఆ వెధవ ఉద్యోగం వద్దు సరూ! ఎందుకు లేనిపోని బెడద ఈ ట్రాన్స్ఫర్‌లు అవీ! నువ్వొక చోట, నేనొకచోటు, ఎందుకీపాట్లు" అన్నాడు తను.

అబ్బే! తనమాట వినందే "ఆ ఏం ఫరవాలేదులెండి. మనకేమన్నా పిల్లలా! కొద్దిరోజులు కష్టపడదాం. ఉన్నది పోగొట్టుకోవడం దేనికి! కొద్ది రోజులు పోయాక ట్రాన్స్ఫర్‌కి "ట్రై" చేద్దాం" అంది తనకి నిజమే ననిపించింది. సరేననితను ట్రాన్స్ఫరై విజయవాడ వచ్చేసాడు.

తను ఇన్ని రోజులనుండి ఎన్ని పాట్లుపడ్డాడు హొటలుభోజనంతో తనకేం హాయిగా అక్కగారింట్లో ఉంటుంది. అదే విషయం రాస్తే ఏలాంటి జవాబిచ్చింది! అలాగైతే తనూ హొటలు భోజనమే చేస్తుందిట. తను తప్పు పని చేసాడు. చెయ్యమనవలసింది అప్పుడు తెలిసేది అమ్మాయిగారికి అయినా తిండికోసం కాకపోయినా సరస్వతి ఎడబాటుతో జీవించడం ఎంత దుర్భరం!

"మాష్టారూ! మీరు రోడ్డుమీద నడిస్తే మేము ఎలా వెళ్ళడం?"

వేణు వెనక్కి చూసాడు. తన ఆలోచనల్లో రోడ్డుమీద నడుస్తూ ప్రాయాణీకుల బ్రతుకు దుర్భరం చేసాడు. వెనకాల ఒక సైకిలు,

---

రెండవబహుమతి రూ. 25/-

**కె. సాయిప్రసాద్**

బి కాం. (ఫైనల్)

పి.ఆర్. గవర్నమెంట్ కాలేజి,

కాకినాడ.

రోసీమీద సైకిలిస్టు సరీగ్గా ముందు చక్రం తన రెండు కాళ్ళకి మధ్య రెండు అంగుళాల దూరంలో ఉంది. సైకిలిస్టు సైడుకి వెళ్ళడానికి వీల్లేకుండా వాహనాలు. ఆ ఉన్నదారి తను మూసేశాడు. మూర్తి ఫుట్ పాత్ ఎక్కాడు.

తను ప్రయత్నించగా, ప్రయత్నించగా ఇన్నాళ్ళకు ట్రాన్స్ఫర్ అయింది. తన ఉత్తరంచూసి సరస్వతి ఎంత సంతోషిస్తుందో! తన భార్య ఇంక ట్రాన్స్ఫర్‌కోసం ప్రయత్నించ నక్కరలేదు. ఇద్దరూ కాకినాడలోనే ఉద్యోగం చేయవచ్చు. సరస్వతి ఎంత దూరదృష్టితో చెప్పింది. లేకపోతే తన తొందరపాటువల్ల బంగారం లాంటి ఉద్యోగం పోను.

ఆలోచనల్లో రెండు మలుపులు తిరిగి రూము చేరుకున్నాడు వేణు. రూము తాళంతీసి లోపలకు వెళ్ళబోతుండగా పోస్టుమాను వచ్చాడు. సంతకం చేయించుకుని ఒక 'ఎక్స్ప్రెస్' ఉత్తరం ఇచ్చాడు. అది సరస్వతి వ్రాసింది. కవరుచింపి దానిని ఉత్సాహంతో చదవడం ప్రారంభించాడు వేణు. దానిలో ఇలా ఉంది.

ప్రియమైన శ్రీవారికి,

నమస్కరించి మీ సరస్వతి వ్రాయునది. ఇక్కడఅంతా క్షేమం. మీ క్షేమ సమాచారములు వ్రాయగోర్తాను. నేను ఈ ఉత్తరంలో మంచి శుభవార్త వ్రాయబోతున్నాను. దానికి నాకు ఏం ప్రెజెంట్ చేస్తారో చూస్తాను.

నాకు ట్రాన్స్ఫర్ అయింది. ఏం ఆశ్చర్య పోతున్నారా! నిజంగా అయింది. ఎక్కడికో కాదు, మీ దగ్గరికే. నేను ట్రాన్స్ఫర్‌కోసం ట్రై చేస్తున్నానంటె ఇంతకు మునుపు మీరు నమ్మారా? ఇప్పుడు ముందు ట్రాన్స్ఫర్ అయింది ఎవరికో చూశారా! నాకు మాత్రం మీ దగ్గరికి రావాలని ఉండదా! సరేకాని నేను నాలుగు రోజుల్లో వస్తున్నాను. వచ్చేముందు మీకు టెలిగ్రాం ఇస్తాను. స్టేషనుకిరండి. మర్చిపోవద్దు అక్క, బావ, మిమ్మల్ని అడిగినట్లు చెప్పమన్నారు. వెంటనే జవాబు వ్రాయండి. ఉంటాను మరి,

మీ సరస్వతి.

***

